క్లుప్తంగా

జోరుగా అభివృద్ధి పనులు



ఎస్సీ కాలనీలో జేసీబీతో చేస్తున్న రోడ్డు తవ్వకాలు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీలో ఉన్న నాలుగు గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. పెదబోగిలిలో ఎస్సీ, బీసీ వీధుల్లో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు ఏఈ చంద్రమౌళి తెలిపారు. ఆదివారం ఆయా పనులను పరిశీలించిన ఆయన నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టామని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో ఈ పనులు చేపడుతున్నామని, వీటిని, నిర్మాణ దశలోని ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను కూడా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీతానగరం పీఏసీఎస్ చైర్మన్ ఎస్.కూర్మారావు, పెదబోగిలి ఎంపీటీసీ ఎస్.గౌరి, సచివాలయ కన్వీనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



సాయికృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: ఉద్యోగులకు వారు విధి నిర్వహణలో చేసిన మంచి సేవలతోనే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం మండలంలోని పెదంకలాం గ్రామానికి చెందిన రాష్ట్ర(ఏపీ ఈపీడీసీఎల్) విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బలగ సాయికృష్ణ ఉద్యోగ విమణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగుల సంక్షేమం కోసమే సాయికృష్ణ తపన పడేవారని, ఆయన సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం సాయికృష్ణను ఎమ్మెల్యే జోగారావు, సీతానగరం ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, యూనియన్ నాయకులు కలిసి, సత్కరించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రామిక మహిళా నాయకురాలు మణి

పార్వతీపురం: పురుషులతో సమానంగా మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకురాలు పి.మణి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పట్టణంలోని గిరిజన సామాజిక భవనంలో శ్రామిక మహిళా జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో శ్రామిక మహిళలు అనేక రకాలుగా తమ ప్రతిభను కనబరుస్తున్నారని, ఆ విధంగా శ్రమించే మహిళా కార్మికులకు హక్కులు, వేతనాల కల్పనలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఐక్య ఉద్యమాలకు శ్రామిక మహిళలంతా సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో ఎం.ఉమామహేశ్వరి, ఎం.గౌరమ్మ, వై.మన్మధరావు, జీవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

హర్షం

గుమ్మలక్ష్మీపురం: శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపకులు, అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు ప్రతిష్టాత్మకమైన డాక్టర్ బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారం లభించడం గర్వించదగిన విషయమని శ్రీశ్రీ కళావేదిక పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పాలక దేవానంద్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. కళలు, కవులను ప్రోత్సాహించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రతాప్‌ను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయడం శుభపరిణామమన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

కురుపాం: యువత భక్తిభావం పెంపొందించుకోవాలని కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం పలువురికి గణపతి విగ్రహాలను వితరణ చేసిన ఆయన ఎలాంటి గొడవలు లేకుండా వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భామిని కేజీబీవీ విద్యార్థులు

భామిని: స్థానిక కేజీబీవీకి చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ బూరాడ శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో నలుగురు, అండర్-17 విభాగంలో ఏడుగురు విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. విజేతలను ఎస్ఓతో పాటు పీఈటీ టి.తేజేశ్వరి అభినందించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పురోహితునివలస పంచాయతీ పరిధిలోని సన్యాసిరాజుపేట, వల్లాపురం, పురోహితునివలస తదితర గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు అయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అందుకే ఆయన అన్ని వర్గాల్లోని ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు.



లబ్ధిదారు మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పురోహితునివలస పంచాయతీలో 505 కుటుంబాలు ఉండగా, 497 కుటుంబాలకు రూ.7.22 కోట్లకు పైగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి జరిగిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన రికార్డు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీ కార్యకర్తలు, ఆ పార్టీ నేతలు, జన్మభూమి కమిటీలు సూచించిన వారికే దక్కేవన్నారు. గతంలో ఆ పార్టీ మొత్తం 600 హామీలు ఇస్తే అందులో కనీసం ఆరు హామీలను కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మరోసారి తమ మాయమాటలతో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో సిద్ధమయ్యారని, వారిని నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.తిరుపతినాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథ, ఏఎంసీ వైస్ చైర్మన్ బంకురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన గిరిజన మత్స్యకార సంఘ సభ్యులు



గిరిజన మత్స్యకార సంఘ సభ్యులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: స్థానిక పట్టణంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను ఆయన స్వగృహంలో పాచిపెంట మండలంలోని కేసలి గిరిజన మత్స్యకార సంఘ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త కార్యవర్గం ఎన్నికైన నేపథ్యంలో తాము కలిశామని, తమను ఆయన అభినందించారని సంఘ అధ్యక్షుడు బచ్చల భోగిరాజు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, మండల జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- రూ.5.68 కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని జి.శివడ పంచాయతీ పరిధిలో జి.శివడ నుంచి రాముడుగూడ, మడ్డుగూడ, ఎగువ కీడవాయి, నాంద్రగండ, వేపమానుగూడ గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.5కోట్ల 68 లక్షలతో బీటీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రోడ్డు సౌకర్యం ఉంటే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని గాలికొదిలేయడంతో గిరిశిఖర గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, తదితర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను చేరవేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, జి.శివడ సర్పంచ్ మిన్నారావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, గుజ్జువాయి సర్పంచ్ హిమరిక నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు రంగారావు, మొండెంఖల్ ఎంపీటీసీ గుడారి విద్యారాణి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో కలుపు నివారణ కీలకం



వరి సాగులో కలుపు మొక్కలు తీస్తున్న కూలీలు

బలిజిపేట: అధిక దిగుబడులకు వరి సాగులో కలుపు నివారణ చర్యలు చాలా కీలకమని మండల వ్యవసాయాధికారి శ్రావణ్ సూచిస్తున్నారు. నారుమడుల తయారీ సమయంలోనే కలుపు నివారణకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం సాగులో కలుపు మొక్కలు బాగా కనిపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఆందోళన చెందాల్సిన పనేం లేదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ప్రాథమిక దశలోనే కలుపు నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయంటున్నారు.

నివారణ ఇలా..

నారుమడులు వేసిన 14 రోజులకు ఓ లీటరు నీటిలో 2 మిల్లీలీటర్ల క్లించర్(సైహలోపాప్ బ్యైటైట్) కలిపిన కలుపు నివారణ మందును పిచికారీ చేయాలి. వరినాట్లు వేసిన తర్వాత 3 నుంచి 5 రోజుల వరకు ఎకరాకు 35 నుంచి 40 గ్రాముల ఆక్సిడయార్జిల్ లేదా 500 మిల్లీలీటర్ల పెట్రాకోల్‌ను 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి. అయితే ఈ సమయంలో వరినాట్లు వేసిన పొలాల్లో ఒక ఇంచి నీటిమట్టం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. అలాగే 80 నుంచి 100 మిల్లీలీటర్ల నామినీగోల్డ్ అనే కలుపు నివారణ మందును పిచికారీ చేయాల్సి ఉంటుంది. వరినాట్లు వేసి 20 నుంచి 30 రోజులు గడిస్తే ఓ లీటర్ నీటిలో ఓ గ్రాము డిపోడియం సాల్ట్ అనే కలుపు నివారణ మందు పిచికారీ చేయొచ్చు. ఇలా చేసే సమయంలో ఎకరాకు 200 లీటర్ల నీటిని వినియోగించాల్సి ఉంటుంది. కలుపు నివారణతో పాటు సరైన సాగు పద్ధతులు కూడా పాటిస్తే అధిక దిగుబడులు ఆశించవచ్చన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసేపు మాట్లాడారు. విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ఎంత ప్రాధాన్యతనిస్తుందన్న విషయం అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం నెయ్యిల వీధిలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. విశ్వకర్మ భగవానుడు విశ్వాన్ని సృష్టించిన వ్యక్తి అని, విశ్వకర్మలను విశ్వభగవానుడి వారసులుగా ఆయన పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణులు లేని వృత్తి లేదన్నారు. రాజకీయ పదవుల్లోనూ విశ్వబ్రాహ్మణులకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా బీసీల సమస్యల పరిష్కారానికి శాశ్వతంగా బీసీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. 50 ఏళ్ల వయసుకే మీ అందరికీ పింఛన్లు వచ్చి, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. మీ అందరికీ అవసరమైన కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కూడా త్వరలో స్థలం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, విశ్వబ్రాహ్మణుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిని ఆనుకుని, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు లాకి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. లోక కల్యాణార్థం ఆలయ కమిటీ సభ్యులతో విశ్వకర్మ విద్య మహోత్సవ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలో విశ్వబ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఆదివారం నిర్వహించారు. ప్రధాన రహదారిలోని పార్వతీదేవి ఆలయంలో విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవి ఆలయం నుంచి నెయ్యిల వీధిలోని ఉత్సవ మండపం వరకు విశ్వకర్మ చిత్రపటంతో తిరువీధి నిర్వహించారు.



పార్వతీపురం టౌన్: విశ్వకర్మ భగవానుడి చిత్రపటంతో తిరువీధిలో విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘ సభ్యులు

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

పార్వతీపురం టౌన్: వినాయక చవితి సందర్భంగా స్థానిక పట్టణంలో నోబుల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ఆదివారం జరిగింది. పర్యావరణ హితమే లక్ష్యంగా దాదాపు 500 మట్టి విగ్రహాలను అందజేశామని, క్లబ్ సభ్యులు తెలిపారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న పార్వతీపురం మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణస్వామి పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రంలో ఎల్.వి.ఆర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ఆదివారం జరిగింది. ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని కాపాడడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఈ విగ్రహాలను పంపిణీ చేశామని, 1000 విగ్రహాల వరకు ప్రజలకు అందజేశామని నిర్వాహకులు అరవింద్‌కుమార్ తెలిపారు.



పార్వతీపురం టౌన్: మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

చంద్రబాబు అరెస్ట్ కరెక్టే..!

గుమ్మలక్ష్మీపురం: 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్'(ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో మాజీ సీఎం, తేదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును అరెస్ట్ చేయడం చట్టబద్ధమేనని జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. సీఐడీ నమోదు చేసిన సెక్షన్లు సరైనవేనని న్యాయస్థానం నిర్ధారిస్తూ ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. కానీ టీడీపీ నాయకులు వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి ఎల్లోమీడియా వంతపాడుతూ సొంత తీర్పులు ఇచ్చేస్తూ, పతాక శీర్షికలతో కథనాలను ప్రచురించడం వెనుకగల ద్వంద్వనీతిని విజ్ఞులైన ప్రజలు గమనిస్తున్నారన్నారు.

తొలిపూజకు వేళాయె!

- నేడు వినాయక చవితి
- తొలిపూజ అందుకోనున్న బొజ్జ గణపయ్య
- పూజలకు సిద్ధం చేసిన మండపాలు
- ఇప్పటికే గ్రామాలకు చేరిన విగ్రహాలు
- పూజసామగ్రి కొనుగోళ్లలో భక్తుల నిమగ్నం
- కిటకిటలాడిన మార్కెట్లు



పార్వతీపురం టౌన్: జనంతో కిక్కిరిసిన మార్కెట్



పార్వతీపురం టౌన్: పూజసామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



మక్కువ: అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

పార్వతీపురం టౌన్: అందరికీ ఇష్టమైన పండగల్లో వినాయక చవితి ఒకటి. ఈ పండగ వస్తుందంటే చాలు కొన్ని నెలల ముందు నుంచే విగ్రహాల తయారీ, కొన్ని వారాల ముందు నుంచే మండపాల ఏర్పాటు చేపడతారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ కలసిమెలసి సరదాగా జరుపుకునే పండగ ఇది. ఉపాధి, ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో ఉన్న వారు కూడా వినాయక చవితి పండగకు సొంత ఊరు వస్తారు. వారం రోజుల పాటు ఉత్సవాల్లో ఆనందంగా గడుపుతారు. సోమవారం వినాయక చవితి కావడంతో ఇప్పటికే మండపాలకు బొజ్జ గణపయ్య విగ్రహాలు చేరుకున్నాయి. భక్తులతో తొలిపూజ అందుకునేందుకు గణేశుడు సిద్ధమయ్యాడు. ఉత్సవ నిర్వాహకులు కూడా మండపాలను అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు కూడా పూజసామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్‌ల వద్ద బారులుతీరారు. ఒక్కో ఉత్సవ కమిటీ వారి స్థాయిని బట్టి, భారీ విగ్రహాలను కొనుగోలు చేసి, ఆటోలు, ట్రాక్టర్లలో ఊరికి తరలించారు. ఈ క్రమంలో గ్రామాల్లో కొలువైన గణనాథులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఎప్పుడు పూజలు మొదలవుతాయా.. గణేశుని చూద్దామా అని భక్తులు కూడా ఉవ్విళ్లూరుతుండడం విశేషం.

మక్కువ: వినాయక చవితి పండగ నేపథ్యంలో మండల కేంద్రంలోని మార్కెట్ జనాలతో కిటకిటలాడింది. ఇప్పటికే మండపాలు సిద్ధం కాగా, వాహనాల్లో గణనాథుని విగ్రహాల తరలింపు కూడా జరిగింది. వివిధ రూపాల్లో కొలువుదీరనున్న గణేశుని ప్రతిమలను చూసేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



మక్కువ: ఆటోలో వినాయకుని విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం